ప్రశ్నించే గొంతులు నొక్కేస్తారా?

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

నరసన్నపేట : వైసిపి సోషల్ మీడియాపై ప్రభుత్వం కక్ష కట్టి కేసులు పెడుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలో ఆదివారం ఒక్కరోజే 42 కేసులు పెట్టారని మండిపడ్డారు. జిల్లాలో సోషల్ మీడియా కార్యకర్తలను పోలీస్‌స్టేషన్లకు పిలిపించి వేధిస్తున్నారని, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తారా అంటూ విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అక్రమాలపై ప్రశ్నించారని కేసులు పెడుతున్నారని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలనూ పక్కనపెట్టి పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎవరి మెప్పు కోసం ఈ కేసులు బనాయిస్తున్నారని, ఎల్లకాలం అధికారం ఒక్కరిదే ఉండదని గుర్తించుకోవాలని ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో విజయగౌరి

- విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై పోరాటం
- పాఠశాలల మూసివేత, అక్రమ బదిలీలపై అలుపెరుగని ఉద్యమాలు
- యుటిఎఫ్ మండల కార్యదర్శి నుంచి రాష్ట్ర స్థాయి నేతగా ఎదుగుదల

జిపిఎస్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న విజయగౌరి (ఫైల్)

విజయగౌరి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

యుటిఎఫ్ (ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ మేరకు విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఆమెను అభ్యర్థిగా ప్రకటించారు. పలు సంఘాలు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచాయి. విజయగౌరి విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై పోరాటం చేశారు. యుటిఎఫ్ సాధారణ కార్యకర్తగా చేరిన ఆమె అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్ర నాయకురాలిగా ఎదిగారు. రేషనలైజేషన్ పేరిట పాఠశాలల కుదింపు, క్లస్టర్ పాఠశాలల విధానం వంటివాటిపై ఉద్యమాలు ముందుకు నడిపేందుకు చొరవ చూపారు. జిఒ నంబరు 72కి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో పోలీసులు అక్రమ కేసు బనాయించినా వెరవలేదు. 2017లో అక్రమ బదిలీలపై జరిగిన ఉపాధ్యాయుల ఆందోళన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయ నేతగా నాయకత్వం వహించారు. అప్పట్లో పెట్టిన కేసు ఏడేళ్లపాటు నడిచింది. పేదలను విద్య నుంచి దూరం చేసే నూతన విద్యావిధానంపై జరిగిన పోరాటంలోనూ ఎంతో చురుగ్గా పనిచేశారు. ఈక్రమంలో ప్రభుత్వ నిర్బంధాలు, బెదిరింపులు, కేసులు ఎదుర్కొన్నారు. 1996 నుంచి బొబ్బిలి ప్రాంతంలో యుటిఎఫ్ విస్తరణకు కృషి చేశారు. యుటిఎఫ్ బొబ్బిలి మండల తొలి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఆమె, అనంతరం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర సహాధ్యక్షులుగా, ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ కార్యదర్శిగా పనిచేస్తూ యుటిఎఫ్ ఉద్యమాల్లోనూ, వివిధ ఉపాధ్యాయ సంఘాలను ఐక్యం చేయడంలోనూ కీలకపాత్ర పాత్ర పోషించారు. ప్రస్తుతం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా చురుకైన పాత్రపోషిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షురాలిగా కూడా సేవలందిస్తున్నారు.

విద్యార్థి దశ నుంచే ప్రగతిశీల భావాలు

విజయగౌరి చిన్ననాటి నుంచే ప్రగతిశీల భావాలు గలవారు. ఆమె అన్నయ్య తిరుపతిరావు ప్రోత్సాహంతో హైస్కూల్‌లో చదువుతుండగానే ఎస్ఎఫ్‌లో చేరారు. అప్పటికే విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు భవాని వెంట వెళ్లేవారు. అలా మొదలైన ఆమెలో నాయకత్వ లక్షణాలు చదువు పూర్తయ్యేవరకు ఎస్ఎఫ్ఎఫ్ నాయకురాలిగా కొనసాగేలా చేశాయి. కాలేజీ స్థాయి నుంచి ఎస్ఎఫ్ఐలో క్రియాశీలక కార్యకర్తగా, చురుకైన నాయకురాలిగా పనిచేశారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరాక భారత జ్ఞాన విజ్ఞాన సమితి వేదికలో 1992 నుంచి 1995 వరకు వందలాది గ్రామాల్లో అక్షరాస్యతా శాతం పెంపునకు కృషి చేశారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగాను, అక్షరాస్యత ఆవశ్యకత గురించి కొన్ని గ్రామాల్లో మూడు నెలలపాటు 20మంది యువతులతో ప్రచారోద్యమం చేపట్టారు. మరోవైపు సమతా కళాజాత నిర్వహణ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ 1994 నుంచి 1996 వరకు సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఏర్పాటు, సైన్స్ ఉద్యమాన్ని బొబ్బిలి ప్రాంతంలో కీలకంగా నడిపారు. ఈ క్రమంలో 72 గిరిజన గ్రామాల్లో పర్యటించి, గిరిజన స్థితిగతులు, ఆ ప్రాంతంలోని విద్యారంగ సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ఎనలేని కృషిచేశారు. ఆ ఉద్యమ ఫలితంగా జిల్లాలో మూతపడిన 12 ప్రభుత్వ పాఠశాలలను తిరిగి తెరవడంతోపాటు కొత్తగా మూడు పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

ఇదీ కుటుంబ నేపథ్యం...

విజయగౌరి తండ్రి సంజీవి నాయుడు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఈ ప్రభావం కుటుంబంపై ఉండడంతో అన్నదమ్ములు, అక్కచెల్లెలు అంతా ఉన్నత చదువులు అభ్యసించిన వారే. అంతకు మించి ప్రగతిశీల భావాలు గలవారు. ఉమ్మడి విజయనగరంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఏకతాటిపైకి తీసుకొస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన కీర్తిశేషులు కె.శేషగిరి మాస్టారు ఈమెకు స్వయాన తమ్ముడు. అన్న తిరుపతిరావు కూడా అభ్యుదయ భావాలగల వ్యక్తి. ఇంజినీరుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. చెల్లెలు రమాప్రభ సామాజిక కార్యకర్తగా పనిచేస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. విశాఖ కేంద్రంగా చిల్డ్రన్స్ క్లబ్ నడుపుతున్నారు. విజయగౌరి భర్త సత్యంనాయుడు కూడా ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సుదీర్ఘకాలంగా జనవిజ్ఞాన వేదికలో పనిచేస్తున్నారు.

గిరిపుత్రుల గొంతుకగా...

- ఆదివాసీల భూముల అన్యాక్రాంతంపై అనేక ఆందోళనలు
- ఐదో షెడ్యూల్ అంశంపై అలుపెరుగని పోరు
- జిఒ నంబరు 3 రద్దు కోసం అనేక ఆందోళనలు
- ఆదివాసీ గిరిజన సంఘం పోరాటాలకు సిపిఎం మద్దతు

కంచిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న గిరిజనులు (ఫైల్)

గిరిజనుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని పాలకులు గొప్పలు చెప్తున్నా, వారి ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. బడ్జెట్‌లో గిరిజనులకు వాటాగా దక్కిన నిధులతోనే ఏవో మొక్కుబడిగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి వాటినే గొప్పగా ప్రచారం చేసుకుంటున్నాయి. ఆదివాసీల సమస్యలను మాత్రం పాలకులు ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఏజెన్సీ ప్రాంతాల్లోని తమ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని ఆదివాసీలు ఏళ్ల తరబడి చేస్తున్న ఆందోళనలు అరణ్యరోదనగానే మిగిలాయి. జిఒ నంబరు 3, భూముల అన్యాక్రాంతం వంటి అనేక అంశాలపై వారు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. గిరిజనులకు మద్దతుగా ఆదివాసీ గిరిజన సంఘం సాగిస్తున్న అనేక పోరాటాలకు సిపిఎం అడుగడుగునా అండగా నిలిచింది. ఈనెల 9, 10 తేదీల్లో పలాసలో సిపిఎం 18వ జిల్లా మహాసభల నేపథ్యంలో గిరిజన రంగం, పోరాటాలపై ప్రత్యేక కథనం.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గిరిజనుల హక్కులకు ప్రత్యేక రక్షణ కల్పిస్తున్న 1/70 చట్టం అమలు జిల్లాలో నీరుగారుతోంది. వంశపారంపర్యంగా వారికి సంక్రమించిన భూములను సైతం ఆక్రమించుకునేందుకు వైసిపి నేతలు, పెత్తందారులు గత ఐదేళ్లలో అనేకరకాల ప్రయత్నాలు సాగించారు. అధికారులతో కుమ్మక్కై రికార్డులను మార్చి వారికి అన్యాయం చేసేందుకు ప్రయత్నించారు. మందస, కంచిలి మండలాల్లో గిరిజనులు సాగులో ఉన్న సుమారు వెయ్యి ఎకరాలను తప్పుడు పేర్లు, రికార్డులతో మార్పులు చేసి ఆదీవాసీలకు అన్యాయం చేసేందుకు ఒడిగట్టారు. భూమినే నమ్ముకుని బతుకుతున్న గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై ఆదివాసీ గిరిజన సంఘం కన్నెర్ర చేసింది. గిరిజనుల సమీకరించి మందస, కంచిలి ప్రాంతాల్లో ర్యాలీ, నిరసనలు చేపట్టింది. తహశీల్దార్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేసింది. వారి పోరాటాలకు సిపిఎం వెన్నంటి నిలిచింది.

ఐటిడిఎ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి

జిల్లాల పునర్విభజనకు ముందు సీతంపేట ఐటిడిఎ కేంద్రంగా గిరిజనులకు సంబంధించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యేవి. ఆదివాసీల సమస్యలూ పరిష్కారమయ్యేవి. జిల్లాల పునర్విభజన తర్వాత శ్రీకాకుళం జిల్లాలో సీతంపేట, భామిని మినహా మెజార్టీ మండలాలు జిల్లాలోనే ఉన్నాయి. ఐటిడిఎ పరిధిలోని మిగిలిన 16 మండలాల్లో 1.60 లక్షల మంది జనాభా ఉన్నారు. జిల్లాల పునర్విభజన నాటి నుంచి జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలంటూ ఎపి గిరిజన సంఘం పలురూపాల్లో చేపట్టిన ఆందోళనలకు సిపిఎం మద్దతుగా నిలిచింది. ఆందోళనల ఫలితంగానే వైసిపి ప్రభుత్వ హయాంలో మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని నాటి ప్రభుత్వ పెద్దలు ప్రకటించాల్సి వచ్చింది. అదేవిధంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా పలాస సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటిడిఎ లేని జిల్లాగా ఉన్న శ్రీకాకుళంలో దాన్ని ఏర్పాటు చేస్తామంటూ హామీనిచ్చారు.

జిఒ నంబరు 3కి వ్యతిరేకంగా గిరిజనుల పక్షాన పోరు

ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలు గిరిజనులకే దక్కేలా ఉమ్మడి రాష్ట్రంలో 2000లో అప్పటి టిడిపి ప్రభుత్వం జిఒ నంబరు 3 తీసుకొచ్చింది. అప్పట్నుంచి వేలాది మంది ఆదివాసీ యువత ఉపాధ్యాయ, ఉద్యోగాలు పొందుతున్నారు. జిఒ నంబరు 3తో గిరిజనేతరులకు అన్యాయం జరుగుతుందంటూ ఖమ్మం జిల్లాకు చెందిన ఓ నిరుద్యోగి సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో 2022 ఏప్రిల్ 22వ తేదీన జిఒ నంబరు 3ను రద్దు చేసింది. దీనిపై గిరిజనుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. గిరిజనుల ప్రయోజనాలను కాపాడడానికి తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేస్తూ ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు సీతంపేట ఐటిడిఎ ముట్టడితో పాటు ఏజెన్సీ బంద్‌ను నిర్వహించారు. సమస్యను అజెండా మార్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో సిపిఎం కీలకంగా వ్యవహరించింది.

ఐదో షెడ్యూల్ అంశంపై అలుపెరుగని పోరు

తమ పంచాయతీలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలంటూ గిరిజనులు ఎప్పట్నుంచో డిమాండ్ చేస్తున్నారు. సీతంపేటలో 24 పంచాయతీలు ఉండగా, కేవలం16 పంచాయతీలు మాత్రమే ఐదో షెడ్యూల్‌లో ఉన్నాయి. ఏజెన్సీ పరిధిలోని 740 గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని గిరిజనులు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. నాటి వైసిపి ప్రభుత్వం 704 గ్రామాలను మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించింది. అది ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. ఏజెన్సీలోని అన్ని గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌తో సిపిఎం నిరంతర పోరాటాలకు రూపకల్పన చేస్తూనే ఉంది.

సరిహద్దు సమస్యలపై పోరాటం

మందస మండలంలోని పలు గిరిజన గూడేలు ఒడిశా రాష్ట్రం సరిహద్దు ప్రాంతాలుగా ఉన్నాయి. తమ రాష్ట్రానికి చెందిన ప్రాంతమంటూ ఒడిశా అధికారులు అనేకసార్లు అభ్యంతరాలు చెప్పారు. ఒకానొక సందర్భంలో మందస మండలంలోని మాణిక్యపట్నంలోని అంగన్‌వాడీ కేంద్రానికి తాళం సైతం వేశారు. దీనిపై ఆదివాసీ గిరిజన సంఘం ఒడిశా అధికారులతో పోరాడిన ఫలితంగా కేంద్రాన్ని తెరిచారు.

వైద్యాధికారులకు 104 ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పోలాకి, బూర్జ, పొందూరు

వేతన బకాయిల చెల్లింపు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొత్తూరు, పోలాకి, బూర్జ, పొందూరుతో పాటు పలు పిహెచ్‌సిల్లో ఈ కార్యక్రమాలను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మాన కిరణ్ మాట్లాడుతూ 104 ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 104 సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 104 సేవల్లో 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిఒ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పిఎఫ్ మొత్తాలను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని కోరారు. డిఎస్‌సి ద్వారా ఎంపికైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టు విధానంలో కొనసాగించాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలాకిలో గుప్పిడిపేట వైద్యాధికారి రత్నరాజ్‌కి వినతిపత్రం అందజేశారు. బూర్జ మండలంలో గుత్తావల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రోజాకి వినతిపత్రం అందించారు. పొందూరు మండలంలో కింతలి పిహెచ్‌సి వైద్యాధికారి శివకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు మహేష్, సూర్యం, నరేష్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ నిధులతో గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికల రూపకల్పనలో పంచాయతీ కార్యదర్శులు సమర్థవంతంగా పనిచేయాలని పంచాయతీరాజ్ శాఖ సహాయ కమిషనర్ కృష్ణమోహన్ సూచించారు. నగరంలోని జిల్లాస్థాయి శిక్షణా వనరుల కేంద్రంలో ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను మంగళవారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీల్లో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) ప్రాధాన్యత, గ్రామీణ స్థితిగతుల మదింపు భాగస్వామ్య పద్ధతులు - గ్రామీణ పేదరికం తగ్గింపు ప్రణాళిక (డిపిడిపి) 2025-26 రూపకల్పనలో పలు అంశాలను వివరించారు. ఎంపిడిఒలు, పంచాయతీ విస్తరణాధికారులు, ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు శిక్షణా తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ సిఇఒ ఎన్.వి శ్రీధర్ రాజా, డిపిఆర్‌సి వైస్ ప్రిన్సిపాల్, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ సత్యనారాయణ, జిల్లా సమన్వయకర్త నిశ్చల, లోకనాథరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి

లావేరు : ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ పనులు వేగవంతం చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు బి.సుధాకరరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని బుడుమూరులో చేపడుతున్న సిమెంట్ రహదారి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా రూ.238.6 కోట్లతో సిమెంట్ రహదారుల పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధి హామీ నిధులు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. నిబంధనల ప్రకారం పనులు చేపడుతూ నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇసి లెనిన్ బాబు, ఉపాధి హామీ, పిఆర్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

9 నాటికి నీటి సంఘాల ఓటరు జాబితా

సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నీటి యాజమాన్య సంఘాల ఓటరు జాబితాలను ఈనెల తొమ్మిదో తేదీ నాటికి సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. త్వరలో నిర్వహించనున్న నీటి సంఘాల ఎన్నికల నాటికి ఎటువంటి పెండింగ్ పనులు లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. పలు శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, గృహనిర్మాణ సంస్థ, సిపిఒ, ఆర్అండ్‌బి, విద్యా, పంచాయతీ, ఉద్యాన, ఇపిడిసిఎల్, డ్వామా, ఐసిడిఎస్, వైద్యారోగ్య శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మీకోసం అర్జీలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి యాజమాన్య సంఘాల ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న పనులను ఇరిగేషన్ ఎస్ఇ సుధాకర్ వివరించారు. తహశీల్దార్లు ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు గెజిటెడ్ అధికారి అవసరమని, ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలు గుర్తించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 8వ తేది నాటికి జాబితాలు సిద్ధం చేయడంపై తహశీల్దార్లతో మాట్లాడారు. నిర్వహణలో ఏమైనా అనుమానాలుంటే నివృత్తి చేసుకోవాలని, 9వ తేదీ నాటికి జాబితాలు సిద్ధం కావాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమస్యాత్మక గ్రామాలుంటే గుర్తించాలన్నారు. జిల్లాలో శాఖల వారీగా ఉన్న కోర్టు కేసులపై సమీక్షించి, తదుపరి చేపట్టాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్అండ్‌బి పరిధిలో కోర్టు కేసుల పెండింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

జిల్లాలో గృహ నిర్మాణాలపై శ్రద్ధ చూపాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో పనులు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్ సంబంధిత మౌలిక వసతులు కల్పించేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల వారీగా వంద రోజుల ప్రగతి అమలుపై సమీక్షించారు. సూర్య ఘర్ పథకం అమలుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 60.679 శాతం అపార్ ఐడి ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖదికారి తిరుమల చైతన్య తెలిపారు. విద్యార్థుల ఆధార్ కార్డుతో పాటే పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. అపార్ ఐడి కార్డు విద్యార్థులకు చాలా కీలకమన్నారు. జిల్లాలో సోంపేట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతోందని, వేగవంతం చేయాలన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి, అపార్ ఐడి కార్డులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు సుధాకర్, శాంతిశ్రీ, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వరప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు తదితరులు పాల్గొన్నారు.

కారిడార్ల పేర్లతో కార్పొరేట్లకు భూములు

- విద్యుత్ భారాలు మోపుతున్న కూటమి ప్రభుత్వం
- జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - కంచిలి

సముద్ర తీర ప్రాంతాల్లో కారిడార్ల పేరుతో రైతుల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు విమర్శించారు. కంచిలిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఒకవైపు అధిక ధరలు, మరోవైపు ఆదాయాలు తగ్గిపోయి సతమతమవుతున్న ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం రూ.17 వేల కోట్లను ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ భారం మోపుతోందని తెలిపారు. వెంటనే ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2023-24 సంవత్సరానికి ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరిట ట్రూ అప్ భారాన్ని ప్రతిపాదిస్తూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు నోటిఫికేషన్లు ఇచ్చాయని తెలిపారు. తాజా ప్రతిపాదనలో యూనిట్ విద్యుత్‌కు గరిష్టంగా రూ.రెండున్నర వడ్డిస్తున్నారని చెప్పారు. నిరుపేదలు యూనిట్‌కి చెల్లించే రూ.1.90కు ఇది 130 శాతం అధికమని తెలిపాపరు. డిస్కమ్‌ల ప్రకటనలో మొత్తం ఎంత భారం వేశారో, అది ఎందుకు అవసరమైందో కనీసం ఒక్క వాక్యం కూడా ఇవ్వకపోవడం ప్రజలను మోసగించడమేనన్నారు. ప్రభుత్వ జెన్‌కో ప్లాంట్ల నుంచి కరెంటు తీసుకోకుండా (బ్యాక్ డౌన్ చేసి) అధిక ధరలకు ఓపెన్ మార్కెట్‌లో కొనుగోలు చేయడమే ఇందుకు ముఖ్య కారణమని తెలిపారు. ప్రైవేట్ కంపెనీలకు అడ్డగోలుగా చెల్లింపులు చేయడం మరో కారణమన్నారు. ప్రభుత్వాల తప్పుడు విధానాలు, అవినీతి, అక్రమాలకు ప్రజలను బలి చేయడం తగదన్నారు. ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు భారాలు మోయాలనడం అసంబద్ధమన్నారు. మోసపూరితమైన ట్రూ అప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 9, 10 తేదీల్లో పలాసలో నిర్వహించే సిపిఎం జిల్లా 18వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 9వ తేదీన భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలో సిపిఎం సోంపేట మండల కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, కంచిలి మండల నాయకులు కె..గోపీనాథ్, పలు సంఘాల నాయకులు ఆర్.రఘు, పి.కృష్ణ, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - పొందూరు

నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పొందూరు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ, రిసెప్షన్, లాకప్, కంప్యూటర్, రైటర్ గదులను పరిశీలించారు. పలురకాల రికార్డులను పరిశీలించి, సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్‌లో ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం, మాదక ద్రవ్యాల కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా పోలీసులకు నేర నియంత్రణపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ గ్రామాలను సందర్శించి, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత, కొత్త నేరస్తులపై నిఘా ఉంచాలని.. మహిళలు, చిన్న పిల్లలపై నేరాలను కట్టడి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్ఠంగా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ డ్రైవ్ నిర్వహించి ప్రమాదాలను నివారించాలన్నారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. క్వారీల్లో సమయపాలన లేకుండా పేలుళ్లపై ఎస్‌పి దృష్టికి పలువురు తీసుకెళ్లగా, నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు చేసే వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్ఐ సత్యనారాయణను ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, సిఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

చేనేత కార్మికులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

చేనేత రంగం అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఒక కళ్యాణ మండపంలో పొందూరు 1, 2, తోలాపి చేనేత క్లస్టర్‌లోని చేనేత కార్మికులకు మంగళవారం పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేనేత సహకార సంఘాలు పడకేశాయని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించని ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛను పథకాన్ని టిడిపి ప్రభుత్వం పెట్టిందన్నారు. చేనేత రంగానికి ప్రభుత్వ అండ, సహకారం అవసరమని గుర్తించి, గత ప్రభుత్వంలో నిలివేసిన పథకాలు, సంక్షేమాలను తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. చేనేత సహకార సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. క్లస్టర్లతో చేనేత కార్మికులకు అవసరమైన పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పరికరాల కోసం లబ్ధిదారులు కేవలం పది శాతం చెల్లిస్తే ప్రభుత్వం 90 శాతం భరిస్తూ పరికరాలు అందించడమే కాకుండా షెడ్లు నిర్మాణం చేపట్టిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి అధికారి టి.జనార్ధనరావు, డిఒలు ఎస్.రమణమ్మ, వి.జి శంకరావు, ఆర్.శేఖర్, టిడిపి మండల అధ్యక్షులు రామ్మోహన్, ఎ.రాము, బి.గిరి, సర్పంచ్ కె.శ్రీను, మాజీ సర్పంచ్ ఎ.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పరికరాలు పంపిణీ చేస్తున్న రవికుమార్

నీటి నమూనాలను పరిశీలిస్తున్న కమిషనర్ బాలాజీప్రసాద్

మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపల్ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ పూజారి బాలాజీప్రసాద్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఆకస్మికంగా పర్యటించి తనిఖీలు చేపట్టారు. ముందుగా 12వ వార్డులో పర్యటించి శానిటేషన్, తాగునీటి సమస్యలపై ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 16వ వార్డులోని డాబాలవారివీధిలో మెట్ట తేజ దగ్గర నుంచి నీటి శాంపిల్‌ను తీసుకొని పరిశీలించి రికార్డులను పరిశీలించారు. మున్సిపాలిటీకి చెందిన తాగునీటి ట్యాంకుల్లో ఎంత పరిమాణంలో క్లోరినేషన్ రోజూ కలుపుతున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఉదాసీనంగా వ్యవహారిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది విధులను అంకితభావంతో నిర్వహించి ప్రభుత్వానికి మున్సిపాలిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. వార్డుల్లో శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహారిస్తూ సిబ్బందితో సక్రమంగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సేవలు అందించడమే మన విధి అని అన్నారు.

అలరించిన దశావధానం

కంచిలి: గణితాన్ని సరైన బోధనా పద్ధతులు ఉపయోగిస్తే విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందని గణిత అవధాని మడ్డు తిరుపతిరావు అన్నారు. కంచిలి బిసి బాలుర వసతిగృహం ఆవరణలో మంగళవారం వార్డెన్ గుల్ల రామారావు ఆధ్వర్యాన నిర్వహించిన 255వ గణిత దశావధానం కార్యక్రమం విద్యార్థులకు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గణితంలో పది అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అవధాని క్షణాల్లో సమాధానాలు చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుత అందరూ భావించే విధంగా గణితం అంటే భయం అవసరం లేదని, సరిగ్గా అర్థం చేసుకుంటే అన్నిటికంటే గణితశాస్త్రం సులభమైనది, శతశాతం మార్కులు వస్తాయని అన్నారు. గణిత సమస్య సాధనలో వేగం, కచ్చితత్వం చాల ముఖ్యమైనదని అన్నారు. వాటిని అభివృద్ధి చేయడానికి గణిత సులభ సూత్రాలు ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని వివరించారు. వార్డెన్ రామారావు మాట్లాడుతూ ఇటువంటి వినూత్నమైన గణిత కార్యక్రమాలు నిర్వహణతో విద్యార్థుల్లో గణితంపైన ఆసక్తి కలిగేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం తిరుపతిరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

అవగాహన కల్పిస్తున్న తిరుపతిరావు

అరాచకాలు అప్పుడు గుర్తుకు రాలేదా?

ఎపిటిపిసి చైర్మన్ బాబూరావు

ప్రజాశక్తి - పలాస

వైసిపి ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు చేసిన అరాచకాలు, అన్యాయాలు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు గుర్తుకు రాలేదా? అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మండిపడ్డారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే లక్కోజు వినోద్ అనే యువకుడిని చితగ్గొట్టి, మద్యం కేసు పెట్టి జైలుకు పంపించిన చరిత్ర అప్పలరాజుది అని అన్నారు. టిడిపి నాయకులు గురిటి సూర్యనారాయణ, నాగరాజు ఇళ్లపై ప్రొక్లెయినర్లు తీసుకెళ్లి కూలదోసే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణరావుపై దాడి చేసి కాళ్లు విరగొట్టి ఆరు నెలల పాటు రోడ్డుపై తిరగనీయకుండా చేశారని చెప్పారు. అప్పలరాజు చర్యల వల్లే పలాసలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. తిరిగి ఆయనే శాంతిభద్రతలపై కలెక్టర్‌కు, ఎస్‌పికి ఫిర్యాదు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. వైసిపి హయాంలో తప్పుడు కేసులు బనాయించడం తప్ప చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని, లేకుంటే ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబెడతామన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, బి.నాగరాజు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు టంకాల రవిశంకర్ గుప్త, జోగ మల్లి, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

అవగాహన కల్పిస్తున్న సిఐ విజయకుమార్

హెల్మెట్ తప్పనిసరి

టెక్కలి రూరల్ : వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని టెక్కలి అర్బన్ సిఐ అంబటి విజయకుమార్ అన్నారు. మండలంలోని బన్నవాడ కూడలిలో రోడ్డుపై భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అతివేగంగా వాహనాలను నడపరాదన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పరామర్శిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం : విజయనగరంలోని కాటవీధిలో ఉన్న బిసి వసతిగృహంలోని ఏడో తరగతి చదువుతున్న రణస్థలం మండలం చిల్లపేటరాజాంకు చెందిన విద్యార్థి కొణతాల శ్యామలరావు ఆదివారం మృతి చెందారు. విద్యార్థి కుటుంబాన్ని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థి మృతిపై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా ఇస్తూ.. ఓదార్చారు.

'పది' స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం రాష్ట్ర అకడమిక్ సెల్ ఆధ్వర్యాన రూపొందించబడిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను డిఇఒ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా, తెలివైన విద్యార్థులకు మంచి మార్కులు స్కోర్ చేసే విధంగా రూపొందించారని తెలిపారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బయలాజికల్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు పుట్టా ఉదయ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, కోశాధికారి వాడాడ త్రివిక్రమరావు, సభ్యులు కంచరాన నాగరాజు, మజ్జి మదన్‌మోహన్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదులో సమస్యలను పరిష్కరించాలి

మందస : రానున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయుల ఓటరు నమోదులోని సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గవ్వ భీమారావు అన్నారు. ఈ మేరకు తహశీల్దార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు నమోదులో ఉన్నత పాఠశాల స్థాయిలో వివిధ మేనేజ్‌మెంట్ల ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న డిడిఒ నుంచి సర్వీస్ ధ్రువపత్రం సమర్పిస్తున్నామని అన్నారు. గత ఆరేళ్లలో మూడేళ్లు సర్వీస్ ఎక్కడ ఉంటే అక్కడ నుంచి సర్వీస్ ధ్రువపత్రాలు తెమ్మంటున్నారని, అలా కాకుండా ప్రస్తుత డిడిఒ వద్దే వారి సర్వీస్ మొత్తానికి సంబంధించి సేవా పుస్తకం ఉంటుందని అన్నారు. వారి సంతకంతో ఉన్న సర్వీస్ ధ్రువపత్రాన్ని అనుమతించాలని కోరారు. సదరు ఓటరు నమోదుకు ఈ నెల 6 చివరి తేదీ అని, సదరు ప్రక్రియను వేగవంతం చేస్తూ.. దరఖాస్తును అందజేసిన వారికి రసీదు విధిగా అందజేయాలని విన్నవించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కర్రి సుందరరావు, కార్యవర్గ సభ్యులు ఎన్.కరుణాకర్, సుశాంత్‌కుమార్ రౌలో, డి. వైకుంఠరావు, బి.తిరుపతిరావు, డి.చంద్రశేఖర్, ఎస్.గణేశ్వరరావు, బి.రామారావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

గురుదేవి మృతదేహం

ఆలయ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సింగుపురం సమీపం జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం రాజారామపురానికి చెందిన గురుదేవి (48) అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలాకి మండలం రాజారామపురానికి చెందిన తల్లీకొడుకులు మైలపల్లి గురుదేవి, మైలపల్లి అజిత్ నాగులచవితి సందర్భంగా మంగళవారం వారి ఇంటి నుంచి బయలుదేరి శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలోని హాటకేశ్వరస్వామిని దర్శించుకో వాడానికి వచ్చారు. తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వెళుండగా... కుక్కగా అడ్డంగా వచ్చింది. దానిని తప్పించే సమయంలో వేగాన్ని నియంత్రించలేక డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. వెంటనే స్థానికులు హైవే అంబులెన్స్‌లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా గురుదేవి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అజిత్‌ను ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పండగ పూట విషాదం చోటు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్ఐ రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని జాడుపూడికు చెందిన కదంబల ఆనందరావు (53) పెద్ద కొజ్జిరియా సమీపంలోని ఓ తోటలో ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆనందరావు గత కొద్దిరోజులుగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆనందరావు మంగళవారం ఉదయం 10 గంటలకు పెద్దకొజ్జిరియా సమీపంలోని తోటలో ఉరిపోసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం : అక్రమంగా ఒరిశా మద్యం సీసాలు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఈదుపురం పంచాయతీ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఇద్దరు వేర్వేరు ప్రాంతాల్లో బి.నాగరాజు, నౌపడ కామరాజులు ఒడిశా మద్యం సీసాలతో రవాణా చేస్తుండగా అరెస్టు చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.. బెల్ట్‌షాపుపై గట్టి నిఘా పెట్టామని తెలిపారు. రెండుసారి మద్యం విక్రయిస్తున్నట్లు పట్టుబడితే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాలించాలన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే... ఎక్సైజ్ సిఐ 8639959250, ఎస్ఐ 9440830385 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు ప్రజా దర్బార్

పాతపట్నం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధ్యక్షతన మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు సమస్యలను వినతుల రూపంలో సమర్పించాలన్నారు. ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరిస్తానని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లావేరు : వినతిపత్రాలను స్వీకరిస్తున్న డిటి తిరుపతిరావు

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

లావేరు : గతంలో జరిగిన భూముల రీ సర్వేలో సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని రీ సర్వే డిటి ఎల్.తిరుపతిరావు అన్నారు. మండలంలోని తాళ్లవలస పంచాయతీ రావివలస, చిర్లపాళెం గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఎటువంటి భూ సమస్యలు ఉన్నా రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలన్నారు. మండల సర్వేయర్ బల్లాడ శ్రీధర్‌రెడ్డి, తాళ్లవలస మాజీ సర్పంచ్ ముప్పడి మురళీమోహన్, ఉపసర్పంచ్ తిరుపతిరావు, డి.కూర్మారావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

బూర్జ : మండలం డొంకలపర్తలో మంగళవారం నిర్వహించిన భూ రీ సర్వే రెవెన్యూ సదస్సు వెలవెలబోయింది. ఉదయం నుంచి 12 గంటల వరకు ఏ ఒక్క అధికారీ హాజరుకాలేదని రైతులు తెలిపారు. తూతూమంత్రంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుంటే... తమ సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని తహశీల్దార్ పద్మావతి వద్ద ప్రస్తావించగా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్నామని, అనంతరం రెవెన్యూ సదస్సులో పాల్గొన్నామని తెలిపారు.

బూర్జ : వినతిపత్రం స్వీకరిస్తున్న తహశీల్దార్ పద్మావతి

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి- పాతపట్నం

మాట్లాడుతున్న కరుణాకరరావు

గృహ నిర్మాణాలు వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి సచివాలయ సిబ్బంది భాగస్వాములు కావాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ సెక్రెటరీలు, లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్లతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూఫ్ కాంక్రీట్ లెవెల్‌లోని ఇళ్లను డిసెంబరుల్లోఆ పూర్తి చేయాలన్నారు. మిగిలిన స్టేజీలో ఉన్న ఇళ్ల నిర్మాణలన్నిటినీ వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. సచివాలయంలో ఒక్కో ఉద్యోగికి కొన్ని ఇళ్ల ట్యాగ్ చేసి, వారు ఆ ఇళ్ల నిర్మాణాలన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే తమకు తెలియపరచాలని సూచించారు. సిమెంట్, ఇసుక, ఇతర సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ చంద్రకుమారి, హౌసింగ్ ఎఇ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై రబీ విత్తనాలు

నందిగాం : అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీకాంత్‌వర్మ

కవిటి: రబీ సీజన్‌లో సాగుచేసేందుకు రాగి, మినుములు, పెసలు విత్తనాలు రాయితీపై అందిస్తున్నట్లు మండల ఎఒ బడగల దుర్గాప్రసాద్ అన్నారు. కవిటి మండలం బల్లిపుట్టుగ, ఒంటూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటకు ఆశిస్తున్న తెగుళ్లు, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న వివిధ యాంత్రీకరణ పనిముట్లు, ఇన్సూరెన్స్ వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిఇఒ లలితకుమారి, వ్యవసాయ సహాయకులు అన్వేష్, జగదీష్, రైతులు బార్ల చినబాబు, పాండు దళై, బార్ల జనార్ధనరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని దీనబంధుపురం, కైజాల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల ఎఒ శ్రీకాంత్‌వర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ సీజన్‌లో అపరాలు పంటలైన మినుము, పెసర, రాగి విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. వీటిని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు మడపాన ప్రసాదరావు పాల్గొన్నారు.

సోంపేట : గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎఒ నరసింహమూర్తి రైతులను కోరారు. మండలంలోని కర్తలిపాలెంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా ఇచ్చిన మూల విత్తనాల పంట సాగును పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. మేలైన సాగు పద్ధతులు పాటించాలని తెలిపారు. రైతులకు ఆయిల్ ఇంజిన్లు, పరదాలు రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పి.విశ్వనాథం, ఎం.ధర్మరాజు, సిబ్బంది ఉష, కుమారి పాల్గొన్నారు.

కేశవరాయపురంలో దాహం కేకలు


పాడైన మోటారు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు పంచాయతీ కేశవరాయుపురంలో తాగునీటికి వారం రోజులుగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ డైరెక్టర్‌గా పంపింగ్ మోటార్ పని చేయకపోవడంతో తాగునీటికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పంపు సెట్లు వద్ద తాగునీరు తెచ్చుకొని తాగుతున్నమని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించినా కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామానికి దూరంగా ఉన్న వ్యవసాయ బోర్లు వద్ద నుంచి నీటిని మోసుకుని రావాల్సి వస్తోందని వాపోయారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి రోజు కూలి పనికి వెళ్లి మళ్లీ రాత్రికి చేరుకొనేసరికి నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నమని వారంతా ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీరు సమస్యను పరిష్కరించాలని గ్రామసుత్లఉ ఉప్పాడ కనకం, దీపల్లి శాంతమ్మ, ఆదిలక్ష్మి, పార్వతి, మంగమ్మ, గొల్ల రామారావు కోరుతున్నారు.

రహదారి నిర్మాణానికి మోక్షం

పోలీసుల సమక్షంలో జెసిబితో చేస్తున్న పనులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురంలో ఏళ్ల తరబడి భూ వివాదంతో అభివృద్ధికి నోచుకోని రహదారికి మంగళవారం ఎట్టికేలకు మోక్షం లభించింది. గ్రామంలో ప్రధాన రహదారి లేక గోర్జి వెంబడి ప్రజలు, వాహన దారులు రాకపోకలు సాగించి అనేక ఇబ్బందులు పడ్డారు. అలాగే గ్రామంలోని ప్రధాన తాగునీటి బావి, నీరు వెళ్లే డ్రెయినేజీ సైతం ఈ గోర్జి వద్ద ఉండటంతో మురుగు నీరు మళ్లీ అదే బావిలోకి చేరి నిత్యం ప్రజలు అనారోగ్యం చెందేవారు. అయితే వీటి అభివృద్ధికి అధికారులు, పాలకులు అనేకసార్లు ప్రతిపాదనలు చేసినా ఈ భూ వివాదం అభివృద్ధికి అటంకంగా మారింది. దీంతో దశాబ్దాలుగా ఈ సమస్య ప్రజలను వెంటాడుతూనే ఉండటంతో వీటి పరిష్కారానికి గ్రామస్తులు పార్టీలకతీతంగా మంగళవారం ఐక్యంగా ముందుకు కదిలారు. యంత్రాల సాయంతో పనులు చేస్తుండగా, చిన్న పాటి గొడవ జరిగింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ నిహార్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సర్దుమణిగించారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొబిషన్, ఎక్సైజ్ అధికారి మల్లికార్జునరావు హెచ్చరించారు. మండలంలోని పూండిలో మాట్లాడుతూ వజ్రపుకొత్తూరు, పలాస రూరల్, పలాస మున్సిపాలిటీ పరిధిలో 15 మద్యం షాపులు ఉన్నాయని తెలిపారు. ప్రతి షాపు వద్దా ధరల పట్టిక ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తే ఫిర్యాదు చేయడానికి సెల్ నంబర్లు షాపుల ముందు గల ఫ్లెక్సీ బోర్డుల్లో ఉన్నాయని అన్నారు. దీనిని ప్రజలు గమనించాలని కోరారు. నాటుసారా, బెల్ట్‌షాప్‌ల నిర్వహణపై ప్రజలు పిర్యాదు చేయడానికి అవసరమైన సెల్ నంబర్లను స్టేషన్ పరిధిలోని సచివలయాలు, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచమని చెప్పారు. బెల్ట్ షాపులు నడిపినా, నాటుసారా తయారు చేసినా, విక్రయించినా బైండోవర్ కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం వసూళ్ల చేస్తామన్నారు. ఎంఆర్‌పి ధరల ఉల్లంఘన, నాటుసారా విక్రయాలు, బెల్ట్‌షాప్‌ల నిర్వహణపై 9440902357, 8008 779075కు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. బెల్ట్‌షాప్‌ల నిర్మూలనకు టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

సన్మానిస్తున్న సిబ్బంది

బదిలీ ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బేసిరామచంద్రపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేసి, బదిలీపై వెళ్లిన బి.నరసమ్మను మంగళవారం సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నరసమ్మ పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

ప్రజాశక్తి- పాతపట్నం

రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. మండలంలోని కాగువాడ మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలకు కలెక్టర్‌కు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. ఈ క్రమంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై నేరుగా మాట్లాడి ఆరా తీశారు. చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అక్కడ వసతి, భోజనం, ఇతర సమస్యలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు విద్యార్థులకు కల్పించాలని సూచించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

రంగస్థల నటుడికి సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రగస్థలంపై ఉన్న ఆసక్తితో మూడున్నర దశాబ్దాలుగా రంగస్థల కళాకారునిగా సేవలందిస్తున్న ముద్దాడ వెంకటరమణమూర్తిని కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు తరపున మంగళవారం సన్మానించారు. నాగుల చవితి సందర్భంగా గార మండలం వేణుగోపాలపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు రంగస్థల కళారంగంలో వెయ్యికి పైగా ప్రదర్శనలు ఇచ్చిన ఆయన తనదైనశైలిలో విభిన్న పాత్రలను పోషించి ప్రేక్షకాదరణ పొందారన్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఇతివృత్తం గల సాంఘిక, పౌరాణిక పాత్రలను పోషించాలరన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం కళాకారుల పింఛను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కొంక్యాన గోవిందరాజులు ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్, సభ్యులు కొంక్యాన రాధాకృష్ణ, కొంక్యాన వేణుగోపాల్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న మురళీధర్

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు నలుగురు ఎంపిక

బాలికలను అభినందిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జూనియర్ కళాశాల స్కూల్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కెజిబివికి చెందిన శైలు, ధనలక్ష్మి, లక్ష్మీశెట్టి, పుష్పలు ఎంపికయ్యారు. వీరు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ స్విమ్మింగ్ క్రీడాకారులకు విశ్రాంత ఆర్మీ ఉద్యోగి దక్కత అప్పారావు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దాస్ రూ.3 వేలు విలువ చేసి స్విమ్మింగ్ సూట్ వీళ్లకి అందజేశారు. వీరు 1993లో పదో తరగతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెందిన పూర్వ విద్యార్థులు రుషి చౌదరి, ఆనంద్ సాహు కార్యక్రమంలో కోచ్ బత్తుల రామారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలువురికి ఆర్థికసాయం

కొత్తూరు: మండలంలోని రాయలకు చెందిన పెద్దింటి లక్ష్మి భర్త ఏడేళ్ల క్రితం మృతి చెందారు. ఈమె ప్రస్తుతం రొమ్ము కేన్సర్‌తో బాధపడుతుంది. దీంతో జీవన ఆధారమంటూ ఏమీ లేకపోవడం, ఆస్పత్రి ఖర్చులకు, మందులకు ఇబ్బందులు పడుతుంది. అలాగే మహార్తపురానికి చెందిన పొన్నాడ వెంకటరావు కార్పెంటర్‌గా పనిచేసి భార్యను పోషించుకునేవారు. ఇటీవల పక్షవాతం బారిన పడడంతో ఇంటికే పరిమితమయ్యారు. దీంతో ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుంది. వీరికి భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు ఆర్థికసాయం, మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు హరి, సిహెచ్.భాస్కర రావు, కె.పోలినాయుడు, టి.ఉపేంద్ర పాల్గొన్నారు.